
సాక్షి ఒడిశా

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5,54,835

బంగారం 1 గ్రాము 50 మిల్లీ గ్రాములు

వెండి 19 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

ఈనెల 5వ తేదీన ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి.

- 8లో

బీజేడీకి ఎమ్మెల్యే ప్రేమానంద రాజీనామా



కెంజొహర్ జిల్లా తెల్కోయ్ శాసనసభ నియోజకవర్గం బీజేడీ ఎమ్మెల్యే ప్రేమానంద నాయక్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

- 8లో

న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్‌గా భవానీ ప్రసాద్



కమిషనర్ భవానీ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

బరంపురం: బరంపురం మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) నూతన కమిషనర్‌గా భవానీ ప్రసాద్ మిశ్రాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

చిట్‌ఫండ్ కార్యాలయంపై ఈడీ దాడులు

బరంపురం: నగరంలోని గాంధీ నగర్ మెయిన్ రోడ్డులోని ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్ కార్యాలయంపై రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అదేవిధంగా లంజిపల్లిలో మరో ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీ కార్యాలయంపై సైతం దాడులు చేపట్టారు. దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

పట్టపూర్ ఐఐసీగా అజయ్



అజయ్ కుమార్

బరంపురం: గంజాం జిల్లా పట్టపూర్ పోలీసు స్టేషన్ ఐఐసీ అధికారిగా అజయ్ కుమార్ స్వాంయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదివరకు కొందమాల్ జిల్లా జి.ఉదయగిరి పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా విధులు నిర్వహించేవారు. పట్టపూర్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

జ్యూట్ బ్యాగుల పంపిణీ



లబ్ధిదారులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలో ఒకటో వార్డు రాంనగర్‌లో జాతీయ ఆహార భద్రత చట్టం, రాష్ట్రీయ ఆహార భద్రత కార్డుల లబ్ధిదారులకు జ్యూట్ బ్యాగ్‌లను జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌లు శుక్రవారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు ఈ పథకం ద్వారా పేద లబ్ధిదారులకు బ్యాగ్‌లను అందించే కార్యక్రమం అమలు చేస్తోంది. దీనిలో భాగంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీరేంద్రకుమార్ దాస్, ఏడీఎం మింజ్, మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సుమన్ జెన

జయపురం: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన అన్నారు. జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి మహులి గ్రామ పంచాయతీ బిచలకోట్ గ్రామంలో చట్టాలపై అవగాహన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజల బాధ్యతలు, కర్తవ్యాలు, స్వేచ్ఛ, సమానత్వం, విద్యపై వివరించారు. జిల్లా న్యాయ సహాయ సేవ ప్రదీకరణలో ప్రజలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు, మధ్యవర్తులు, ముఖాముఖి చర్చలతో వివాదాలు పరిష్కారం తదితర అంశాలను తెలియజేశారు. జాతీయ న్యాయసేవ ప్రదీకరణ ద్వారా రాజ్యాంగంలో కల్పించబడిన హక్కులు, బాధ్యతలను చెప్పారు. గ్రామాల్లో తలెత్తే వివాదాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం ఉందని, ఆ చట్టం మేరకు వలస కార్మికులకు లేబర్ కంట్రాక్టర్లు పరిచయ పత్రాలు సమకూర్చాలన్నారు. ఆ పరిచయ పత్రాల్లో కార్మికుని పేరు, చిరునామా, ఫొటో, నియమించిస్తున్న పని, వేతనం మొదలగు విషయాలు పొందుపరచాలని వెల్లడించారు. 14 ఏళ్లలోపు చిన్నారులను బడికి పంపించాలని ప్రజలు సూచించారు. కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి విచారపతి అనిమేష్ జెన, జిల్లా లేబర్ విభాగ అధికారి చిన్మయ కుమార్ సాహు, పారా లీగల్ సమాజ సేవకులు ఆనందకుమార్ ముదులి, రామేశ్వరి హికాక, రాజేశ్వరి మహురియ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- తెరుచుకోనున్న రత్న భాండాగారం
- వార్షిక రథయాత్రకు తెరుస్తాం
- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి నరకా



భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయం రత్న భాండాగారం తెరవడానికి సమయం ఖరారైంది. ఈ ఏడాది వార్షిక రథయాత్ర సందర్భంగా తెరవనున్నట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి జగన్నాథ్ సరకా అసెంబ్లీలో శుక్రవారం ప్రకటించారు. భాండాగారం తెరవడంలో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేశారనే ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. శ్రీమందిర్ జగ్‌మోహన్‌కు ఆనుకుని రత్న భాండాగారం నెలకొని ఉంది. భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ ప్రతిపాదన మేరకు దీని లోపల, బయటి రత్న భండారాలు తెరిచి పనులు చేపడితే సాధారణ యాత్రికులు, భక్తుల దర్శనానికి అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఈ ఏడాది రథయాత్ర సమయంలో రత్న భండాగారం లోపలి భాగం పటుత్వం నిర్ధారించేందుకు తనిఖీ చేయడానికి భారత పురావస్తు శాఖని అనుమతించాలని శ్రీమందిరం పాలక మండలి ముందస్తుగా గతేడాది ఆగస్టు నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిందన్నారు. అయితే అందులో భద్రపరిచిన విలువైన ఆభరణాల జాబితాకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

పురావస్తు శాఖ అభ్యర్థన మేరకు..

రత్న భాండాగారం పరిశీలించేందుకు భారత పురావస్తు శాఖ ముందస్తు లిఖితపూర్వ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ పరిరక్షణ సంస్థ 2018, 2022లో కూడా ఇలాంటి లేఖలు రాసింది. 2018 సంవత్సరంలో ఏఎస్ఐ సాంకేతిక నిపుణుల కమిటీ రత్న భాండాగారాన్ని బయటి నుంచి తనిఖీ చేసింది. ఈ నేపథ్యంలో దీని పరిస్థితి శిథిలావస్థలో ఉందని పేర్కొంది. గోడల నుంచి నీరు కారడం, కొన్ని రాళ్లు పట్టు తప్పడం, కొన్నిచోట్ల ప్లాస్టర్ బలహీనపడడం వంటి పరిస్థితులు నెలకొని ఉన్నట్లు ఏఎస్ఐ సాంకేతిక నిపుణుల వర్గం అభిప్రాయం వ్యక్తం చేసింది. దీంతో శ్రీజగన్నాథ స్వామి రత్న భాండాగారం తెరిచేలా చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఒరిస్సా హైకోర్టులో పలు ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ప్రాచీన శ్రీమందిరం రత్న భాండాగారంలో భద్రపరిచిన విలువైన ఆభరణాలు, పాత్రలు వగైరా సొత్తు జాబితా ప్రక్రియను పర్యవేక్షించేందుకు శ్రీ మందిరం పాలక మండలి (ఎస్‌జేటీఏ) తమను ఆశ్రయిస్తే, ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సెప్టెంబర్‌లో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని తెలిపారు. శ్రీ మందిరం రత్న భాండాగారంలో భద్రపరిచిన అమూల్య రత్న సంపదని చివరిసారిగా 1978 సంవత్సరం మే 13, జూలై 23న పరిశీలించారు. ఆ తర్వాత 1985 సంవత్సరం జూలై 14న రత్న భాండాగారం తెరిచినా లోపల భద్రపరిచిన ఆభరణాలు ఇతరేతర రత్న సంపద పరిశీలన, గణన చేపట్టనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అర్పణ్ రథాలతో రూ.3.6 కోట్ల విరాళాలు

- వెల్లడించిన జగన్నాథ ఆలయ పాలకవర్గం

భువనేశ్వర్: ఈ ఏడాది జనవరి 17న శ్రీమందిరం వారసత్వ ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా అర్పణ్ రథాలు పర్యటించాయి. దీనిలో భాగంగా భారీగా విరాళాలు లభించినట్లు శ్రీజగన్నాథ ఆలయ పాలకవర్గం (ఎస్‌జేటీఏ) శుక్రవారం తెలియజేసింది. భక్తుల నుంచి విరాళాల రూపంలో సమగ్రంగా రూ.3,06,62,813 నగదు పోగైనట్లు వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 22 నుంచి ఫిబ్రవరి 7 మధ్య వివిధ కార్యాలయాలు, జిల్లా పరిషత్ కార్యాలయం, జిల్లా కలెక్టర్, పంచాయతీ సమితి, మున్సిపల్ కార్పొరేషన్ మరియు గ్రామ పంచాయతీల నుంచి ఈ విరాళాలు ఆలయ పాలక వర్గానికి ముట్టాయని తెలిపారు. ఈ సొమ్ము రాష్ట్రంలో 30 జిల్లాల భక్తుల నుంచి సేకరించబడిందని పేర్కొన్నారు.

పరిశీలనకు ప్రత్యేక కమిటీ

భక్తుల విరాళాల పరిశీలనకు ఎస్‌జేటీఏ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ 6 దశల్లో విరాళాలు లెక్కించింది. లెక్క తేలిన తర్వాత సమగ్ర సొమ్మును ఆలయ పాలకవర్గం బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అర్పణ్ రథాల ఆధ్వర్యంలో భక్తుల నుంచి సుమారు 250 క్వింటాళ్ల బియ్యాన్ని సేకరించారు. ఈ బియ్యం శ్రీమందిరం నిర్వాహకులకు అందజేశారు. సూపకార్ సేవాయత్ వర్గం విరాళం బియ్యాన్ని ఉపయోగించి ఖిచిడీ, కణిక ప్రసాదాన్ని తయారు చేసి ఆలయం సమీపంలో భక్తులకు పంపిణీ చేసింది. శ్రీజగన్నాథునికి నైవేద్యంగా బియ్యం, వక్క, నగదును భక్తులు సమర్పించారు. భక్తుల నుంచి సేకరించిన బియ్యం (పచ్చి బియ్యం, ఉప్పుడు బియ్యం) మిశ్రమంగా ఉండడంతో మహాప్రసాదం తయారీలో వినియోగించలేదు. అర్పణ్ రథాల ద్వారా సేకరించిన వక్కను పవిత్ర త్రిమూర్తుల కోసం బిడియా పాన్ తయారీలో ఉపయోగిస్తారు.

గంజాయితో ఇద్దరు యువకులు అరెస్టు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి రైల్వే కాలనీ వెనుక అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను టికిరి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు సంచుల్లో 102 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని శుక్రవారం కోర్టుకు తరలించారు. పట్టుబడిన వ్యక్తులు టికిరి గ్రామానికి చెందిన రహీమ్ కుమార్ బెనియా(27), తొలొకొడిగా గ్రామానికి చెందిన లింకన్ తురుక్ (25)లుగా వెల్లడించారు. వారి నుంచి గంజాయితో పాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

రథయాత్రకు సన్నాహాలు



రథ కలపతో బయల్దేరిన ట్రక్కులకు పూజాదులు



దుంగలతో పూరీకి బయల్దేరిన 3 ట్రక్కులు



గ్రామస్తుల భజన, సంకీర్తనాలాపన

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ స్వామి రథయాత్రకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. యాత్ర పురస్కరించుకుని ఏటా 3 భారీ కొత్త రథాలు నిర్మించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి నయాగఢ్ అటవీ ప్రాంతం నుంచి అనుకూలమైన కలప దుంగలు సేకరిస్తారు. ఈ ప్రాంతం నుంచి శుక్రవారం తొలి విడత కలప దుంగలను శ్రీజగన్నాథుని రథాల తయారీకి తరలించారు. ఈ సందర్భంగా స్వామి రథాల కోసం ఖరారు చేసిన కలప దుంగలతో నిండిన ట్రక్కులను యాత్ర శుభప్రదం కావాలని ఆకాంక్షతో ధూపదీపాదులు సమర్పించి శ్రీజగన్నాథ నామ సంకీర్తనలతో సాగనంపారు. తొలి విడత కింద 3 ట్రక్కుల్లో 102 భారీ దుంగలను పూరీకి తరలించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

నాటుసారాపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ అధికారుల వరుస దాడులు
- 14 మంది అరెస్టు



పాకలాపల్లి అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ



పాకలాపల్లిలో అరెస్టైన నిందితులు

బరంపురం: గంజాం జిల్లాలో నాటుసారా తయారీ, అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపారు. అస్కా పోలీసుస్టేషన్ పరిధి పాకలాపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో కొద్దిరోజుల నుంచి అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో గురు, శుక్రవారం రెండు రోజులు పాకలాపల్లి అటవీ ప్రాంతంలో ఎక్సైజ్, అస్కా పోలీసులు దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా 13,335 లీటర్ల నాటుసారా, విప్పపువ్వు, నల్ల బెల్లం ఊటని ధ్వంసం చేశారు. మరో 420 లీటర్ల నాటుసారా, డ్రమ్ములు, పైప్‌లు వంటి సామగ్రీలు స్వాధీనం చేసుకొని, 10 మంది నిందితులను అరెస్టు చేశారు. అదేవిధంగా కళ్లికోట్, బంజనగర్, సురడా, బుగడా ఎక్సైజ్ అధికారుల బృందం వివిధ ప్రాంతాలైన కలసండిపూర్, జగన్నతపల్లి, తంగిడిపల్లి, గండపల్లి, పాకలపల్లి, బందులి వంటి గ్రామాల్లో సోదాలు నిర్వహించారు. అక్కడ ఎటువంటి లైసెన్స్‌లు లేకుండా అక్రమంగా విక్రయిస్తున్న నాటుసారా దుకాణలపై దాడులు చేసి, మరో నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి దగ్గర నుంచి మరో 1,265 లీటర్ల సారా సీజ్ చేశారు.



కళ్లికోట్‌లో అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు



బంజనగర్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

ఘనంగా వంశధార వసంతోత్సవాలు



ఉత్సవ రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గిరిజన నాయకులు



కలశాలతో నదీజలం తీసుకొస్తున్న మహిళలు



ప్రసంగిస్తున్న లావణ్య సాబొరో

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో 12వ వంశధార వసంతోత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. గుణుపూర్ ఆడిటోరియంలో జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతాయి. దీనిలో భాగంగా ముందుగా సమీపంలోని వంశధార నది నుంచి మహిళలు కలశాలతో నదీజలం తీసుకొని ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. గిరిజన నాయకుడు లావణ్య సాబొరో, రొహదాస్ సాబరో, డాక్టర్ సుజాత దేవి, బీడీవో శుభ్రాంజలి ప్రధాన్, తహసీల్దార్ లీలావతి ఆచార్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్షయ్ కుమార్ దాస్, కార్యదర్శి రంజిత్ పాడి, సీనియర్ న్యాయవాది ఉమాచరణ్ పట్నాయక్ తదితరులు జగన్నాథ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గిరిజన నాయకుడు లావణ్య సాబొరో మాట్లాడుతూ గత 11 ఏళ్లగా సమష్టిగా సమైఖ్యత చాటుకుంటూ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఆదివాసీ సాంప్రదాయాలు, సంస్కృతి, కళలను పరిరక్షించేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఉత్సవాల ప్రచార రథం ప్రారంభించారు.

విజిలెన్స్ వలలో డేటా ఆపరేటర్



గౌరహర పాడి

బరంపురం: విజిలెన్స్ వలకు మరో అవినీతి చేప చిక్కింది. గంజాం జిల్లా ఆర్టీవో కార్యాలయం డేటా ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌరహర పాడి రూ.12 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా విజిలెన్స్ అధికారులకు చిక్కాడు. బరంపురం విజిలెన్స్ ఎస్పీ మాయాధర్ స్వాంయి తెలిపిన వివరాల మేరకు.. గురువారం మధ్యాహ్నం గంజాం జిల్లా ఛత్రపూర్ ఆర్టీవో కార్యాలయంలో డేటా కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌరహర పాడి వాహనాల బకాయిలు మాఫీ చేసే కేసులో పరిష్కారం కోసం బాధితుడు పి.రాజ సేనాపతి దగ్గర లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు పి.రాజ సేనాపతి బరంపురం విజిలెన్స్ అధికారులను ఆశ్రయించాడు. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాలతో విజిలెన్స్ డీఎస్పీ సంతును కుమార్ మహాపాత్రో ఆధ్వర్యంలో బృందం పథకం పన్ని డేటా ఆపరేటర్ రూ.12 వేల లంచం తీసుకుంటుండగా అరెస్టు చేశారు. అతడిని కోర్టుకి తరలించినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది



శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. గుమ్మాబ్లాక్ జామి గ్రామ పంచాయతీ సదారాంపూర్ గ్రామంలో రైతు సచేతన శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ పథకాలు గురించి ముఖ్య వ్యవసాయ అధికారి బలరాం సుబుద్ధి వివరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ విజయనగరం క్యాంపస్ డీన్ ప్రశాంత్ మహంతి, డివిజనల్ అటవీ శాఖ అధికారి పాల్గొన్నారు.

చెన్నై వెళ్లిన సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: అనారోగ్యంతో బాధపడుతున్న బిజూ జనతాదళ్ నాయకురాలు, ఖల్లికోట రాణి వి.సుజ్ఞాన కుమారి దేవ్‌ను పరామర్శించడానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం రాత్రి చెన్నై వెళ్లారు. ఆమె ఆరోగ్యం ఇటీవల క్షీణించడంతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పర్లాకిమిడి: గుసాని సమితి పాటికోట గ్రామం మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఐదేళ్ల బాలుడు మృతి చెందగా, ఆటోలో ఉన్న ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్ర ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు. వారికి ఎమర్జెన్సీ వార్డులో చికిత్స చేస్తున్నట్లు అదనపు పీహెచ్‌వో డా. ప్రదీప్‌కుమార్ పండా తెలియజేశారు. మెరుగైన చికిత్స కోసం సాయంత్రం ముగ్గురు క్షతగాత్రులను బరంపురం మెడికల్‌కు తరలించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలియజేశాయి.

వలస మత్స్యకారుడు మృతి

రణస్థలం: మండలంలోని ఎన్‌జీఆర్‌పురం పంచాయతీలో గల గురయ్యపేట గ్రామానికి చెందిన చీకటి కృష్ణ(31) గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ్ జిల్లా వీరావల్‌లో మృతి చెందాడు. వీరావల్ నుంచి వేట కోసం నాలుగు రోజుల కిందట సముద్రంలోకి వెళ్లాడని, సముద్రంలోనే శుక్రవారం తెల్లవారు సమయంలో మృతి చెందాడని సమాచారం. అక్కడ ఏం జరిగిందో తెలియదని, మృతదేహం ఇంకా వీరావల్ ఒడ్డుకు రాలేదని గ్రామస్తులు, మత్స్యకార నాయకుడు పిల్ల తాత తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు పాపలు ఉన్నారు. కుటుంబమంతా గురయ్యపేటలోనే ఉంటున్నారు. మరణవార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి గార మండలం రామకృష్ణాపురానికి చెందిన మాసాభక్తుల జయనీష్(22) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పలాస రైల్వే ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రం కాగా.. జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనదారులకు తీవ్రగాయాలు

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ కంబిరిగాం గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారికి వెళ్లే సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో పలాస మండలం పెద్దనారాయణపురం గ్రామానికి చెందిన పిట్ట మాధవరావు, పిట్ట మోహన్‌రావులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సత్యం, శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు

పొందూరు: స్థానిక బస్టాండ్ సమీపంలోని ఎంఎస్ఎన్ కాంప్లెక్స్‌లో సాయంత్రం అనకాపల్లి శ్రీనివాసరావు ఇంటిలో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో వంట గదిలోని సామాన్లతో పాటు ఇంటిలో ఉన్న సోఫా ఇతర వస్తువులు కాలిపోయాయి. మంటలు వ్యాపించిన సమయంలో శ్రీనివాసరావు భార్య బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.



శాసనసభ ఆవరణలో ముఖ్యమంత్రి నవీన్‌తో ఎమ్మెల్యేలు

ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

భువనేశ్వర్: ఈనెల 5వ తేదీన ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సమావేశాలు 16వ శాసనసభ చిట్ట చివరి సభ కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, స్పీకర్ ప్రమీలా మల్లిక్‌తో అఖిల పక్షాల ఎమ్మెల్యేలు ఫోటో షూట్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా అధికార, విపక్ష సభ్యులు ఒకరికి ఒకరు తమ రాబోయే రాజకీయ యాత్రకు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎమ్మెల్యేల్లో భావోద్వేగం

ఈ విడతతో పలువురు శాసన సభ్యులు ప్రాతినిధ్యం నుంచి వైదొలగనున్నారు. వీరిలో స్వచ్ఛందంగా పోటీకి దూరమవుతున్న వారు మరికొందరు కాగా, ఈసారి పోటీ చేసేందుకు అవకాశం దక్కుతుందో లేదోననే సందిగ్ధంతో భావోద్వేగానికి మరికొందరు గురయ్యారు. రాష్ట్ర కాంగ్రెసు సీనియర్ నాయకుడు, శాసనసభ నాయకుడు నరసింగ మిశ్రా, జట్నీ నియోజకవర్గం దీర్ఘకాల ప్రతినిధి సురేష్ కుమార్ రౌత్రాయ్ పోటీ నుంచి శాశ్వతంగా వైదొలగుతున్నట్లు ప్రకటించారు. వీరివురు ఇదే చివరి సమావేశంగా పేర్కొన్నారు. ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల నుంచి పోటీని విరమించుకుంటున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర శాసనసభ చిరస్మరణీయమని కాంగ్రెస్ శాసనసభ నేత నరసింగ మిశ్రా



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

తెలిపారు. కాబట్టి ఈ చివరి సెషన్ ఎప్పటికీ చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. అదేవిధంగా స్పీకర్ ప్రమీలా మల్లిక్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలంతా ఫోటో సెషన్‌లో ఒక్కటవ్వడం ఆనందదాయకమైన ఘట్టమన్నారు. తొలి మహిళా స్పీకర్‌గా విశేష అనుభవం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు.

రెండు రోజులు ముందుగానే...

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్ధారిత సమయం కంటే 2 పని దినాలు ముందుగా శుక్రవారం నుంచి నిరవధికంగా వాయిదా పడ్డాయి. ప్రభుత్వ చీఫ్ విప్ ప్రశాంత ముదులి సభను మిగిలిన కాలానికి వాయిదా వేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ సభ్యులు మాట్లాడాలని కోరగా స్పీకర్ ప్రమీలా మల్లిక్ నిరాకరించారు. ఇందుకు నిరసనగా వారు సభలో నిష్క్రమించారు. విపక్షం సభ్యులు వాకౌట్ చేయడంతో స్పీకర్ అసెంబ్లీని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 5న ప్రారంభమైన బడ్జెట్ సెషన్ ఫిబ్రవరి 13న ముగియాల్సి ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి 4 నెలలకు గాను రూ.1.18 లక్షల కోట్ల ఓట్ ఆన్ అకౌంట్‌ను ఆర్థిక మంత్రి బిక్రమ్ కేశరి అరూఖ్ గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం అసెంబ్లీలో వ్యయ మంజూరి బిల్లు ఆమోదం పొందింది.

బోరుమన్న ఎమ్మెల్యే

రాష్ట్ర శాసన సభ ఆవరణలో జట్నీ నియోజకవర్గం ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్ బోరుమన్నారు. సభ గోడకు మొక్కుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఇక నుంచి పోటీ చేయడం లేదని ప్రకటించిన ఆయన, సభకు ప్రణమిల్లి బయటకు వచ్చారు.



బీజేడీకి ఎమ్మెల్యే ప్రేమానంద రాజీనామా



ఎమ్మెల్యే ప్రేమానంద

భువనేశ్వర్: కెంజొహర్ జిల్లా తెల్కోయ్ శాసనసభ నియోజకవర్గం బీజేడీ ఎమ్మెల్యే ప్రేమానంద నాయక్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. గతేడాది అక్టోబర్ నెలలో బిజూ జనతా దళ్ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్‌లకు తన రాజీనామా లేఖను ఈ–మెయిల్ ద్వారా పంపినట్లు నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా పార్టీలో తనను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది అక్టోబర్‌లో రాజీనామా లేఖను పంపినప్పటికీ చర్చించడానికి పార్టీ నుంచి ఎవరూ సంప్రదించలేదని పేర్కొన్నారు. తన సమస్యలతో పాటు తన నియోజకవర్గానికి సంబంధించి న పలు ఆందోళనకర పరిస్థితులపై చర్చించేందుకు పార్టీ అధ్యక్షుడిని కలిసే అవకాశం లేకుండా పోయిందని ఆరోపించారు. 2019 ఎన్నికల తర్వాత నుంచి దళపతి నవీన్ పట్నాయక్ పార్టీ ఎమ్మెల్యేలకు అందుబాటులో లేకుండా పోయారన్నారు. ఇది కాకుండా పంచాయతీ ఎన్నికలకు ముందు తన ప్రధాన ప్రత్యర్థుల్లో ఒకరు బీజేడీలో చేరేందుకు పార్టీ తీసుకున్న నిర్ణయంపై ప్రేమానంద నాయక్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ చర్యతో బీజేడీ స్థానిక శాఖలో అనారోగ్యకరమైన వాతావరణాన్ని ప్రేరేపించిందన్నారు. ప్రేమానంద 2009, 2019లో జరిగిన ఎన్నికల్లో తెల్కోయ్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచారు. 2019 నుంచి 2022 సంవత్సరం వరకు 3 ఏళ్లపాటు మధ్య రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్యా శాఖ సహాయ మంత్రిగా కొనసాగారు.

‘కిస్’ శాఖ ఏర్పాటుకు సన్నాహాలు

రాయగడ:

ఆదివాసీ విద్యార్థుల ఆశాదీపం కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సర్వీసెస్ (కిస్) సంస్థ త్వరలో రాయగడలో శాఖను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోందని ఆ సంస్థ కన్వీనర్ రోనిత్ సాబొరో తెలియజేశారు. స్థానిక కస్తూరీ నగర్‌లో కిస్ సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, ఆదివాసీ విద్యార్థులకు ఉచితంగా చదివించేందుకు సంస్థ ఎంతగానో కృషి చేస్తోందని తెలియజేశారు. రాయగడలో శాఖ ఏర్పాటైతే విద్యార్థుల తల్లిదండ్రులతో సత్సంబంధాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కళింగ టీవీ బ్యూరో హెడ్ అమూల్య రత్న సాహు మాట్లాడుతూ కిస్ సంస్థ ఏర్పాటుతో ఎంతోమంది ఆదివాసీ యువతీ, యువకులు విద్యావంతులయ్యారని హర్షం వ్యక్తం చేశారు.



వేదికపై సాబొరో, అమూల్య రత్నసాహు తదితరులు

ఈ సంస్థ శాఖలు ప్రారంభమైతే సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మేలు జరుగుతుందని అకాంక్షించారు. కిస్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ అచ్యుత్ సామంత లక్ష్యసాధనకు అంతా కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

ఆమదాలవలస: చింతాడ గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు (46)అనే పెయింటర్ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసరావు ఈనెల 4వ తేదీన పట్టణంలోని పూజారిపేటకు చెందిన తోట షర్మిల ఇంటి మేడపైన పెయింటింగ్ వర్క్ చేస్తూ సాయంత్రం ఐదు గంటల సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలయ్యారు. క్షతగాత్రుడిని రాగోలు జెమ్స్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నాడు.

హాకీ చాంపియన్‌షిప్ ప్రారంభం



మంత్రి హాకీ క్రీడను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. మండల పరిధిలోని పాత్రునివలసలో గల మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో టెక్కం కిశోర్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహించిన 14వ హాకీ ఏపీ జూనియర్స్ ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. పలు ప్రాంతాలకు చెందిన వారు ఒకే చోట కలిసి ఆడితే చాలా విషయాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం పాత్రునివలసలో పూర్తిస్థాయిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం అభివృద్ధి చేసేందుకు కొంత సమయం పడుతుందన్నారు. పాత్రునివలసలో 14 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఆడుతున్నారని, వారికి స్థానికులు సహకరించాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆడుదాం ఆంధ్రా ఫైనల్ పోటీలు విశాఖలో జరుగుతున్నాయని, ఈ పోటీలకు చాలామంది క్రీడాకారులు, కోచ్‌లు ఇప్పటికే విశాఖపట్నం చేరుకున్నట్లు మంత్రి వివరించారు. ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణ, అనిల్‌కుమార్ పలువురు కోచ్‌లు పాల్గొన్నారు.

బీజేడీలోకి సంతృప్త మిశ్రా

భువనేశ్వర్: కార్పొరేట్ దిగ్గజం ఆదిత్య బిర్లా కార్బన్ మాజీ గ్రూప్ డైరెక్టర్ సంతృప్త మిశ్రా బిజూ జనతా దళ్‌లో శుక్రవారం చేరారు. స్థానిక నవీన్ నివాస్‌లో సీఎం నవీన్ పట్నాయక్ సమక్షంలో ఆ పార్టీ కండువ కప్పుకున్నారు. పూరీకి చెందిన మిశ్రా గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్, బిర్లా కార్బన్ గ్రూప్ డైరెక్టర్, కెమికల్స్ డైరెక్టర్ వంటి సర్వోన్నత హోదాల్లో కీలక బాధ్యతలు నిర్వహించి విశేష గుర్తింపు సాధించారు. ఆయన స్థానిక ఉత్కళ విశ్వవిద్యాలయం నుంచి రాజనీతి శాస్త్రంతో మాస్టర్స్ డిగ్రీ, సాధారణ పాలన విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి విద్యాధికుడుగా నిలిచారు. కార్పొరేట్ రంగంలో సుదీర్ఘంగా 27 ఏళ్లపాటు కీలక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించిన అనుభవంతో బీజేడీ అధిష్టానం కేటాయించిన ఏ బాధ్యతనైనా దక్షతతో నిర్వహిస్తానని ప్రకటించారు.

జాతీయ అధికార ప్రతినిధిగా నియామకం

కార్పొరేట్ రంగంలో విశేష అనుభవంతో గుర్తింపు సాధించిన సంతృప్త మిశ్రా పార్టీలో చేరడంపై సీఎం నవీన్ పట్నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. ఆయనను బీజేడీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమించినట్లు ప్రకటించారు. కార్పొరేట్ రంగంలో ఆయన విశేష అనుభవం పరిగణనలోకి తీసుకుని ఈ మేరకు నిర్ణయించినట్లు వెల్లడించారు.



సీఎం నవీన్ పట్నాయక్‌తో సంతృప్త మిశ్రా తదితరులు

హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ఆమదాలవలస రూరల్: మండలంలో తొగరాం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు తమ్మినేని అప్పలరాజు (45) భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. అప్పలరాజు హైదరాబాద్‌లో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నారు. ఎప్పటిలాగానే గురువారం భవన నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉండగా మూడో అంతస్తు పై నుంచి ప్రమాదవశాత్తు జారి కిందకు పడిపోయారు. వెంటనే సంఘటన స్థలంలో ఉన్న తోటి కూలీలు ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. మృతునికి భార్య భారతితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



మృతుడు తమ్మినేని అప్పలరాజు (ఫైల్)

రథసప్తమి దర్శనాల రూట్ మ్యాప్ ఇలా...



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగయ్య, పక్కనే డీసీ రమేష్‌బాబు, ఏసీ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: రథసప్తమి మహోత్సవానికి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు సిద్ధం చేస్తుండగా.. మరోవైపు ఆలయ ప్రాంగణంలో రంగులు, విద్యుత్ అలంకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ఇతర అధికారులు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు.

దర్శన మార్గాలివే..

ఉచిత దర్శనం: అరసవల్లి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల వద్ద ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఎంటర్ అయ్యి.. ఇంద్రపుష్కరిణి ఆగ్నేయ ద్వారం నుంచి కంపార్ట్‌మెంట్ల ద్వారా ఆలయంలోకి రావాల్సి ఉంటుంది.

రూ.100 (ప్రత్యేక దర్శనం): ఇది కూడా నగర కార్పొరేషన్ స్కూల్ దగ్గర నుంచే క్యూలైన్‌లో ఎంటర్ అయి.. క్యూలైన్‌లోనే టిక్కెట్టు కొనుగోలు చేసి పుష్కరిణి ఈశాన్య మార్గం నుంచి గోశాల పక్క నుంచి ఆలయంలోకి రావాల్సి ఉంటుంది.

క్షీరాభిషేక దర్శనం (రూ.500): ఈ క్యూలైన్ అరసవల్లి ప్రధాన రహదారిలో బొంపాడ వీధి దగ్గర నుంచి సింహద్వారం మీదుగా ఆలయ ప్రధాన ద్వారం నుంచి స్వామి దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఈ టిక్కెట్టుకు అనుమతి ఉంటుంది. క్యూలైన్లలోనే ఈ టిక్కెట్లు కొనుగోలు చేసుకోవాలి. ఒక టిక్కెట్టుతో ఇద్దరికి అనుమతిస్తారు.

రూ.500 (విశిష్ట దర్శనం): క్షీరాభిషేకం టిక్కెట్టు క్యూలైన్లోనే ఈ టిక్కెట్టు దారులకు అనుమతించనున్నారు. అయితే ఉదయం 7 గంటల నుంచి మాత్రమే ఈ టిక్కెట్లు విక్రయాలు మొదలుకానున్నాయి. ఈ టిక్కెట్టుకు కూడా ఇద్దరిని అనుమతించనున్నారు.

డోనర్ పాసులు (దాతలు): ఈ దాతల పాసుదారులు బొంపాడ వీధి నుంచి ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఆలయ ఉత్తర ద్వారం నుంచి దర్శనాలకు వెళ్లనున్నారు. అయితే వీరికి ఈసారి ప్రత్యేకంగా టైమ్ స్లాట్ అమలు చేస్తుండగా అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నారు. ఇప్పటివరకు సుమారు 1000 మంది దాతలు రికార్డు అయ్యారు. ఒక్క పాసు ద్వారా నలుగురికి అనుమతి ఉంటుంది.

వీఐపీ దర్శన టిక్కెట్టు (రూ..500): దాతల పాసుల స్లాట్ టైమ్ ముగియగానే అంటే ఉదయం 7 గంటల నుంచి ఈ విఐపి దర్శన టిక్కెట్టు దారులకు (ఒక్కో టిక్కెట్‌కు ఇద్దరికి అనుమతి) ఇదే క్యూలైన్లలోనే దర్శనాలకు అనుమతిస్తారు. ఈ వీఐపీ దర్శన పాసులను అరసవల్లి యూనియన్ బ్యాంకులో విక్రయించేందుకు మొత్తం 3000 పాసులను సిద్ధం చేశారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు 750 మందికి, 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తర్వాత 750 మందికి, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మరో 750 మందికి, రాత్రి 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు చివరి 750 మంది పాసుదారులకు అనుమతించనున్నారు.

➺ ఇక వీవీఐపీలకు అంటే అసెంబ్లీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఆలయ పాలక మండలి సభ్యులు, ఇతర కీలక నేతలకు కూడా ఈసారి ప్రత్యేక దర్శన పాసులను అందుబాటులోకి తేనున్నారు. అయితే వీరిని ప్రత్యేక వాహనాల ద్వారా సింహద్వారం నుంచి అనుమతించి తిరిగి ఇదే మార్గంలో వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

బొలేరో బోల్తా

మందస: మండలంలోని కొర్రాయిగేటు సమీపంలోని పాతకమలాపురం గల జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కోటబొమ్మాళి నుంచి ఇచ్ఛాపురం వైపు జొన్నపొత్తుల లోడుతో వెళ్తున్న ఈ వాహనం కొర్రాయిగేటు సమీపానికి వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. డ్రైవర్ కె.విశ్వనాథ్ కేబిన్‌లో ఇరుక్కుపోగా, తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది బి.సంతోష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, బాబురావు, చలపతిరావు, దమయంతి, సరోజిని సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అతికష్టం మీద బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స అనంతరం హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బొలేరోను క్రేన్ సాయంతో పక్కకు తొలగించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



జాతీయ రహదారిపై బోల్తా పడిన బొలేరో వాహనం

గంజాయి రవాణా ముఠా అరెస్టు

- అరెస్టయిన వారిలో ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి పూణెకు 72 కిలోల గంజాయిని తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పర్లాకిమిడి జంగం వీధిలో నివాసం ఉంటున్న ఉత్తర గౌడో సాహి, రాయగడ బ్లాక్‌కి చెందిన కుసా బుయాన్, తలముండా గ్రామానికి చెందిన రంజుగొమాంగోలు బరంపురంలో 72 కేజీల గంజాయిని కొనుగోలు చేసి లగేజీ బ్యాగ్, సూట్‌కేస్‌లలో ప్యాక్ చేసుకొని కారు ద్వారా బుధవారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. అదేరోజు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో పుణే వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరి వద్ద లగేజీ గుర్తించిన ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు వారిని రూ.20వేలు లంచం అడిగారు. లేదంటే కేసు పెడతామని బెదిరించారు. దీంతో ఆ ముఠా సభ్యులు రూ.5వేలు మాత్రమే ఇచ్చారు. కానీ ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు ఒప్పుకోలేదు. దీంతో ముఠా సభ్యుడు రంజు గొమాంగో ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లతో సమీపంలోగల ఎస్‌బీఐ ఏటీఎంకి వెళ్లి రూ.10వేలు మరో చోట రూ.8వేలు తీసి ఇచ్చాడు. అప్పటికే ట్రైన్ వెళ్లిపోవడంతో గంజాయి ముఠా సభ్యులు రైల్వే స్టేషన్ సమీపంలోని చిదంబరేశ్వర ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరిని చూసిన స్థానికులు అనుమానంతో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పట్టణ పోలీసులు వీరిని పట్టుకుని 72 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.23వేలు తీసుకుని గంజాయి రవాణాకు సహకరించిన ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ, రూరల్ ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు, కవిటి ఎస్‌ఐ రాము సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

క్లుప్తంగా

రుణ రికవరీ శతశాతం లక్ష్యంగా పని చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

విజయనగరం అర్బన్: పొదుపు సంఘాల రుణ రికవరీ శతశాతం అయ్యేలా సంబంధిత సిబ్బంది పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి అన్నారు. జిల్లాలోని 27 మండలాల సిబ్బందితో స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆదేశించారు. ఈ సందర్భంగా స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, ఎస్‌వీఈపీ, హెచ్‌డీఐఎఫ్ వంటి కాంపొనెంట్లకు సంబంధించి లావాదేవీలను మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి నెలతో ముగుస్తున్న ఆర్థిక సంవత్సర లావాదేవీలలో రికవరీలు శతశాతం చేయాలని కోరారు. మొబైల్ బుక్ బుకింగ్‌పై సూచనలిచ్చారు. అన్ని మండలాలు ఏ గ్రేడ్‌లో నమోదు కావాలని అందుకు అవసరమైన లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో హార్టీకల్చర్ అధికారి జమదగ్ని పాల్గొని పీఎంఎఫ్ఎంఈ గ్రౌండింగ్‌పై డీఆర్‌డీఏ సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్

వంగర: మండల పరిధి అరసాడలో 26 మద్యం బాటిల్స్‌తో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ వై.వి.జనార్దన్ తెలిపారు. శుక్రవారం అరసాడలో ఎస్‌ఐ పర్యటిస్తుండగా ఓ వ్యక్తి వద్ద అక్రమ మద్యం నిల్వలున్నట్టు గుర్తించామని చెప్పారు. దాడులు చేసి మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట జంక్షన్ నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న లచ్చింపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి సూరిదేముడుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ గోపాలరావు శుక్రవారం తెలిపారు. సంతపేట జంక్షన్‌లో గల మద్యం దుకాణం నుంచి 20 మద్యం సీసాలను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా ఏఎస్‌ఐ గోవిందరావు మాటుకాసి పట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



భోగాపురం: పట్టుబడ్డ మద్యం బాటిళ్లతో సీఐ రవికుమార్, సిబ్బంది

భోగాపురం: మండలంలోని తోటపల్లి కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేసిన సమయంలో మద్యం అక్రమంగా తరలిస్తున్న బమ్మిడిపేట గ్రామానికి చెందిన బమ్మిడి రామసూర్య నుంచి 42 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రవికుమార్ తెలిపారు. అతని ద్విచక్ర వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

మద్యం, సారాను తగలబెట్టిన పోలీసులు



మద్యం, సారాను తగలబెట్టిస్తున్న ఏఎస్పీ సునీల్ షరోన్, ఎస్‌ఐ రాజేష్

సీతానగరం: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో దాడులు చేసి పట్టుకున్న మద్యం, సారాకు సంబంధించి 16 కేసుల్లో పట్టుబడిన 873 మద్యం బాటిల్స్, 24 బీరు బాటిల్స్, ఒక కేసులో పట్టుకున్న సారాను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం పార్వతీపురం సబ్‌డివిజనల్ ఏఎస్పీ సునీల్ షరోన్ సమక్షంలో తగలబెట్టారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఏఎస్పీ సునీల్ షరోన్ దగ్గరుండగా ఎస్‌ఐ ఎం.రాజేష్, పోలీస్ సిబ్బంది అప్పలకొండ, సుజాత, ప్రసాద్ మద్యం బాటిల్స్ చితక్కొట్టి, సారా తగలబెట్టారు.

గ్యాస్ లీకై మహిళకు గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని తాగేందొరవలస గ్రామంలో శుక్రవారం ఉదయం గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో మార్పిన నారాయణమ్మకు ఒంటిపై గాయాలైనట్టు ఎస్ భూర్జవలస ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. గురువారం రాత్రి గ్యాస్‌ను ఆఫ్ చేయకపోవడంతో ఇళ్లంతా గ్యాస్ లీకై ఉన్న విషయాన్ని గమనించకుండా లైట్లు వేయడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఆమె ఒంటిపై గాయాలవ్వడంతో విశాఖలోని కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించినట్టు తెలిపారు.

హోమియో వైద్యానికి ఆదరణ

- జిల్లా కేంద్రంలో ఉన్న హోమియో వైద్యశాలకు నెలకు 2 వేల మంది రోగులు
- దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో మంచి వైద్యం
- పూర్తి స్థాయిలో మందులు



రోగులకు మందులు సిద్ధం చేస్తున్న కాంపౌండర్



చిన్నారిని పరీక్షిస్తున్న హోమియో వైద్యాధికారి



చికిత్స కోసం వచ్చిన రోగులు

విజయనగరం ఫోర్ట్: హోమియో వైద్యం పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతిలో వైద్యం ద్వారా నయం కావడంతో జనం హోమియోపతి వైద్యం చేయించుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఫలితంగా హోమియో వైద్యశాలల్లో ఓపీ సంఖ్య పెరుగుతోంది. రోగులకు అవసరమైన మందులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచింది. దీంతో రోగులకు ఉచితంగా వైద్యం అందుతుంది. సామాన్యునికి అందుబాటులో ఉండేది హోమియో వైద్యం. ఇందులో చికిత్సకు అయ్యే ఖర్చు కూడా తక్కువే. ముఖ్యంగా సైడ్ ఎఫెక్ట్స్(దుష్ఫరిణామాలు) ఏమి హోమియోలో ఉండవు. దీంతో ఈ వైద్యానికి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోంది.

హోమియో శాఖ పటిష్టం

జిల్లాలో హోమియో శాఖ పటిష్టంగా ఉంది. జిల్లాలో 29 హోమియో వైద్యశాలలు ఉన్నాయి. ఇందులో రెగ్యులర్ వైద్యశాలలు 16 ఉన్నాయి. ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) విభాగంలో 13 పని చేస్తున్నాయి. అన్ని వైద్యశాలల్లోను చికిత్సకు అవసరమైన మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

హోమియో వైద్యశాలకు అధిక సంఖ్యలో రోగులు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న హోమియో వైద్యశాలకు అధిక సంఖ్యలో రోగులు నిత్యం వస్తున్నారు. నెలకు 1800 నుంచి 2 వేల మంది వరకు రోగులు వస్తున్నారు. మిగతా వైద్యశాలల్లో కూడా అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. విజయనగరం మినహా మిగిలిన 28 వైద్యశాలల్లో గతంలో 2వేల నుంచి 3 వేల వరకు ఓపీ ఉండేది. ప్రస్తుతం 5వేల నుంచి 6 వేల వరకు ఓపీ ఉంది. ఓపీ సంఖ్య బాగా పెరిగింది. వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే వారికి హోమియో చికిత్స ద్వారా నయం కావడంతో ఓపీ సంఖ్య పెరుగుతుంది.

దీర్ఘకాలిక వ్యాధులకు మంచి వైద్యం

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో మంచి వైద్యం ఉంది. ముఖ్యంగా కీళ్ల సమస్యలు, అజీర్తి, చర్మ సంబంధిత వ్యాధులకు హోమియో చికిత్స సత్ఫలితాలను ఇస్తుంది. హోమియో వైద్యశాలలకు వచ్చే వారిలో 40 శాతం మంది కీళ్ల సమస్యలు, నడుం నొప్పి, మెడ నొప్పి, మైగ్రేన్‌తో బాధపడే వారు వస్తున్నారు. 20 శాతం ఊబకాయంతోను, ఇతర జలుబు, దగ్గు, నరాల బలహీనత తదితర సమస్యలతో 40 శాతం మంది వస్తున్నారు. బీపీ, షుగర్, పిట్స్ వంటి వ్యాధులకు మంచి మందులు హోమియో ఉన్నాయి.

తక్కువ ఖర్చుతో హోమియో వైద్యం

హోమియో వైద్యంలో సాధారణ జ్వరాన్ని రూ.2 వెచ్చిస్తే సరిపోతుంది. అదే అల్లోపతి వైద్యంలో అయితే రూ.20 నుంచి రూ.40 వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఆయుర్వేద, యూనాని వైద్యానికి అయితే ఎక్కువగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. కీళ్ల సమస్యల్లో రుమాటిక్ ఆర్థరైటిస్, రుమటైడ్ ఆర్థరైటిస్ వ్యాధులకు హోమియో పూర్తిగా నయం చేయవచ్చు.

హోమియో మందులతో ఉపశమనం



భరించలేని నడుం నొప్పితో తీవ్ర ఇబ్బంది పడ్డాను. ఏడాది పాటు ఇంగ్లీష్ మందులు వాడాను. అయినా తగ్గలేదు. దీంతో 6 నెలలు క్రితం సర్వజన ఆస్పత్రిలో ఉన్న హోమియో ఆస్పత్రికి వెళ్లాను. అక్కడ ఇచ్చిన మందులతో నాకు నడుం నొప్పి తగ్గింది. ఇక్కడ ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా హోమియో వైద్యం అందించడం చాలా సంతోషంగా ఉంది.

– సంక్రాన యమున, కె.ఎల్.పురం, విజయనగరం

కీళ్ల నొప్పులు తగ్గాయి



కీళ్ల నొప్పులు భరించలేని విధంగా ఉండేవి. తీవ్ర ఇబ్బంది పడేదాన్ని. నడవడానికి కూడా ఇబ్బంది పడేదాన్ని. ఇంగ్లిష్ మందులు వాడాను, అయినప్పటికీ పెద్దగా ప్రయోజనం లేదు. సర్వజన ఆస్పత్రిలో ఉన్న హోమియో ఆస్పత్రికి వచ్చాను. గత రెండు నెలలు నుంచి ఇక్కడ మందులు వాడుతున్నాను. ఇప్పుడు మోకాళ్ల నొప్పులు బాగా తగ్గాయి. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు.

– గేదెల రాములమ్మ, గంట్యాడ

హోమియోకు ఆదరణ



హోమియో వైద్యానికి ఆదరణ పెరుగుతుంది. ప్రభుత్వం హోమియో వైద్యానికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచింది. ఓపీకి వచ్చే వారికి అందించిన చికిత్స వల్ల మంచి ఫలితాలు వస్తుండడంతో రోగుల సంఖ్య పెరుగుతుంది. కీళ్ల సమస్యలు, జీర్ణకోశ సమస్యలు, ఊబకాయం వంటి సమస్యలతో ఎక్కువగా రోగులు వస్తున్నారు.

– బి.వరప్రసాద్, సీనియర్ హోమియో వైద్యాధికారి, విజయనగరం

16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

విజయనగరం ఫూల్‌బాగ్: ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక అమర్‌భవన్‌లో ఆ సంఘం విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మికులను, రైతులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు బానిసలుగా చేయటానికి మోడీ చట్టాల్లో మార్పులు చేస్తున్నారని మండిపడ్డారు.గత పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బివి.కొండలరావు, ఎస్.రంగరాజు, బుగత అశోక్, ఎం.శ్రీనివాసరావు, కె.స్రవంతి, పి.రామకృష్ణ, డి.అప్పలరాజు, పి.అప్పారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి భారీ షాక్




రేగిడి : సరసనాపల్లిలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని సరసనాపల్లి, జోడిబందల గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమానికి ఆకర్షితులై ఈ గ్రామాల నుంచి భారీగా టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ గ్రామాలకు చెందిన పెనుబోతు సూరప్పడు, ఆలిబిల్లి మహేశ్వరరావు, గవరసింగి సింహాచలం, పక్కి సాతందొరలతో పాటు మరో 25 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారంతా మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో టీడీపీకి సరైన నాయకుడు లేరని, ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలుకుతున్నారని, ఈ సమయంలో టీడీపీలో ఉండే కంటే వైఎస్సార్‌సీపీలో అభిమానిగా ఉండడం మంచిదని భావించి పార్టీ మారినట్టు వెల్లడించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్ కుమార్, సర్పంచ్‌లు కర్రి అప్పలనాయుడు, ఎంపీటీసీ కెల్ల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 10లోగా లైసెన్స్‌లు రెన్యువల్ చేయించాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ వైవీ రమణ



మేలుజాతి దూడ యజయానికి ప్రోత్సాహక బహుమతి ఇస్తున్న డీడీ రమణ తదితరులు

శృంగవరపుకోట: జిల్లాలోని ప్రైవేటు పాల కేంద్రాలు, బల్క్‌మిల్క్ సెంటరు ప్రభుత్వ మిల్క్‌యాక్ట్‌ను అనుసరించి మార్చి 10వ తేదీలోగా లైసెన్స్‌లు రెన్యువల్ చేయించుకుని తమ కార్యకలాపాలు నిర్వహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ వైవీ రమణ స్పష్టం చేశారు. మండలంలోని సన్యాసయ్యపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ నేతృత్వంలో శుక్రవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. లేగదూడల పెంపకందారులను ప్రోత్సహించి మేలుజాతి దూడల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగానికి సేద్యం జీవనాడి అయితే, పశువుల పెంపకం ప్రాణనాడి కావాలన్నారు. లేగదూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషణ పద్ధతులను వివరించారు. లేగదూడల పోషణతో మంచి ఆర్థిక లాభాలు సాధించవచ్చన్నారు. రూ.1000లు రుసుంతో లైసెన్స్‌లు పొందవచ్చాన్నారు. డీఎల్‌డీఏ జిల్లా వైద్యాధికారి ఎస్.దామోదర్ మాట్లాడుతూ మేలుజాతి లేగదూడలను లింగ నిర్ధారణ చేసి వీర్యకణాలు ద్వారా మేలుజాతి పెయ్యిలను విజయనగరం డివిజన్ రైతులు పొందుతున్నారన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు, గడ్డి పెంపకం దారులు తమ పశువులకు వసతి కల్పనకు ఎటువంటి హామీలు లేకుండా బ్యాంకు నుంచి కిసాన్ క్రెడిట్ పథకం ద్వారా రూ.లక్షా 60వేలు 25పైసలు వడ్డీకి పొందవచ్చన్నారు. పథకం పొందాలనుకునే వారు ఆర్‌బీకేలు లేదా సచివాలయాల్లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సన్యాసయ్య, ఎ.డి చలపతిరావు, పశువైద్యాధికారిణి హేమ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ




పోలీస్ సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్‌లు, ఆర్మ్‌డ్ రిజర్వు, హోంగార్డు విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. వ్యక్తిగత, ఉద్యోగ, అనారోగ్య, శాఖాపరమైన సమస్యలను సిబ్బంది వివరించారన్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టామన్నారు. దీంతో పోలీస్ సిబ్బంది ఆనందాన్ని వ్యక్తం చేశారు.

జూదరుల అరెస్టు

పాచిపెంట: పేకాట ఆడుతూ పట్టుబడ్డ 12మంది పేకాటరాయుళ్లపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. మండలంలోని గురువునాయుడుపేటకు చెందిన 12 మంది వ్యక్తులు గురువునాయుడుపేట సమీపంలో పేకాట ఆడుతుండగా పట్టుకున్నామని, వారి నుంచి 18,100 రూపాయిల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యతోనే వికాసం



వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అసోసియేట్ డీన్

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యతోనే వికాసం కలుగుతుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను ఆధ్వర్యంలో కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. వృత్తి సంబంధమైన విషయాల్లో పరిణితి సాధించాలన్నారు. పశువైద్య విద్యను అభ్యసించినవారు గ్రూపువన్ పరీక్షల్లో రాణిస్తున్నారన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందుగా సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు సందడిచేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంబంధ అధికారి జె.వి.రమణ, డా.అలహాసింగారి, విశాఖ నగరం మున్సిపల్ అడిషనల్ కమిషనర్ డా.సన్యాసిరావు, విజయనగరం, శ్రీకాకుళం పశు సంవర్ధక సంయుక్త సంచాలకుడు విశ్వేశ్వరరావు, కిశోర్, వై.వి.రమణ పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనుల పండువగా జరిపించారు. వెండి మండపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మండపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపుజేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రా 236/4

- ఉత్తరప్రదేశ్‌తో రంజీ మ్యాచ్ ప్రారంభం
- 90 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన రిక్కీ బుయ్



72 పరుగులు చేసిన ఆంధ్రా బ్యాట్స్‌మెన్ శశికాంత్



ఉత్తరప్రదేశ్ బౌలర్ అకిబ్‌ఖాన్

విజయనగరం: జిల్లా వేదికగా ప్రారంభమైన ఆంధ్రా – ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య రంజీ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు మొదటి రోజు శుక్రవారం శుభారంభం చేసింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో టెస్ట్ మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు జరగనున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఉత్తరప్రదేశ్ జట్టు బౌలింగ్ ప్రారంభించింది. బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 80 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 236 పరుగులు చేసింది. ఆంధ్రా బ్యాట్స్‌మెన్స్ రిక్కీ బుయ్ 171 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్సర్‌తో 90 పరుగులు చేసి నాటౌట్‌గా రాణిస్తుండగా... కెవి.శశికాంత్ 83 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 72 పరుగులు, కరణ్ షిండే 135 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 45 నాటౌట్‌గా నిలిచారు. ఉత్తరప్రదేశ్ జట్టు బౌలింగ్‌లో అకిబ్‌ఖాన్ 11 ఓవర్లలో 1 వికెట్, అంకిత్ రాజ్‌పుత్ 16 ఓవర్లలో 1 వికెట్ దక్కించుకున్నారు. మరో మూడు రోజుల పాటు మ్యాచ్ కొనసాగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో మెరిసిన మహిళ లిఫ్టర్లు



శనపతి పల్లవి



చుక్కా శ్రీలక్ష్మి



బి రాజేశ్వరి

నెల్లిమర్ల రూరల్: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈ నెల ఏడో తేదీ నుంచి జరుగుతున్న ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన మహిళ వెయిట్ లిఫ్టర్లు సత్తా చాటారు. 64 కేజీల విభాగంలో పోటీలో పాల్గొన్న శనపతి పల్లవి, స్నాచ్‌లో 80 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 100 కిలోలు...మొత్తంగా 180 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం సాధించింది. 81 కిలోల విభాగంలో చుక్కా శ్రీలక్ష్మి స్నాచ్ 83 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 102 కిలోలు...మొత్తంగా 185 కిలోల బరువును ఎత్తి వెండి పతకం దక్కించుకుంది. అదే గ్రామానికి చెందిన మరో క్రీడాకారిణి బి.రాజేశ్వరి 45 కేజీల విభాగంలో పోటీలో పాల్గొని స్నాచ్ 60 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 80 కిలోలు...మొత్తంగా 140 కిలోల బరువును ఎత్తి కాంస్య పతకం కైవసం చేసుకుంది. ప్రతిభ కనబరిచిన మహిళ లిఫ్టర్లకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధి జోగింపేటలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సు (ప్రతిభా పాఠశాల)లో 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో 8వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి బాలురు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, పశ్చిమ గోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు మార్చి 25 లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8వ తరగతిలో 45 సీట్లు, ఇంటర్‌లో ఎంపీసీలో 45 సీట్లు, బైపీసీలో 45 సీట్లు ఉన్నాయన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయల్లోపు వున్న వారు అర్హులన్నారు. దీనికి సంబంధించి ఏప్రిల్ 7న కామన్ ఎంట్రన్స్ పరీక్ష జోగింపేటలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు కన్వీనర్ ప్రిన్సిపాల్ 94909 57218, ప్రిన్సిపాల్ 94401 03332 నంబర్లను సంప్రదించాలన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు చేరిన మతిస్థిమితం లేని వ్యక్తి



మతి స్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

విజయనగరం క్రైమ్: మతిస్థిమితం లేక నగరంలో సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా అలిగండ గ్రామానికి చెందిన బుద్దాసభా సుందర్ గత కొంతకాలంగా మతి స్థిమితం లేకపోవడంతో నగరంలో సంచరిస్తున్నాడు. ఈ నెల 7న రాత్రి సుమారు 3 గంటల సమయంలో ఉడా కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి సంచరిస్తున్నట్టు కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

అతనిని విచారించగా ఒడిశాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతని బంధువులకు సమాచారమందించారు. దీంతో అతని భార్య తపస్విని, మేనల్లుడు నాయక్‌లు వచ్చి అతనిని గుర్తించారు. మతి స్థిమితం లేక నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడన్నారు. అతన్ని అప్పగించిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పిండి మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజాం సిటీ:

స్థానిక పోలీసుస్టేషన్ రోడ్డులోని ఓ ఫ్లోర్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉన్న 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నామని సీఎస్‌డీటీ చిరంజీవరావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శుక్రవారం రేగిడి సీఎస్‌డీటీ సాయికామేశ్వరరావు, ఎంఆర్‌ఐ విద్యాసాగర్‌లతో కలసి దాడి చేసి పట్టుకున్నామని అన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు మిల్లు యజమాని శాసనపు రాంబాబుపై 6ఏ కేసు నమోదు చేశామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని తెలిపారు.



ఎండీయూ వాహనంలో స్వాధీనం చేసుకున్న బియ్యం తరలిస్తున్న అధికారులు

సీతానగరం: మండల కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ సింహాచలం ఆధ్వర్యంలో సీజ్ చేసినట్టు సీఎస్‌డీటీ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి 12 గంటల సమయంలో బొబ్బిలి నుంచి ఒడిశా రాష్ట్రం అలమండకు బొలెరో వ్యాన్‌లో తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు మండల కేంద్రంలోని ఓవర్‌బ్రిడ్జి వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. వ్యాన్‌లో సరుకును పరిశీలించగా బియ్యం ఉన్నట్టు గుర్తించిన అనంతరం బియ్యం ఎక్కడ నుంచి ఎక్కడికి తరలిస్తున్నారని వ్యాన్ డ్రైవరును ప్రశ్నించినట్టు తెలియజేసారు.

సేకరించిన సమాచారం మేరకు బొబ్బిలి నుంచి అక్రమంగా తరలిస్తున్న 2టన్నుల 950 కేజీలు అలమండకు తరలిస్తున్నట్టు గుర్తించి వ్యాన్ డ్రైవరుపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్థానిక వీఆర్వో ఎం.సింహాచలం, రేషన్ డిపో డీలరుకు అప్పగించినట్టు తెలిపారు.